## కాల్వల పనులను వేగంగా పూర్తి చేయిస్తాం

రామన్నపేట : ఉత్తటూరు గ్రామంలో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, ఫిబ్రవరి 26 : ఆయా ప్రాజెక్టులు, కాల్వల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందిస్తూ కాల్వల పనులను వేగవంతంగా పూర్తి చేయిస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల పనులపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వల నిర్మాణ పనులకు ప్రజలు సహకరించాలన్నారు. రైతులు, అధికారుల నుంచి సూచనలు స్వీకరించిన ఆయన నీటి పారుదల మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకుముందు ఉత్తటూరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను, మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ మందడి ప్రభాకర్‌రెడ్డి ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. పల్లెల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఏటెల్లి శ్రీనివాస్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు తిమ్మాపురం మహేందర్‌రెడ్డి, ఎండీ రేహాన్, నాయకులు గంగుల రాజిరెడ్డి, జినుకల ప్రభాకర్, పున్న జగన్‌మోహన్, మందడి రవీందర్‌రెడ్డి, గుత్తా నర్సింహారెడ్డి, గోదాసు పృథ్వీరాజ్, జెల్ల వెంకటేశం, ఎండీ అక్రం, గొలుసుల ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## లింగబసవేశ్వరస్వామికి వెండి గొడుగు

ఆలయ చైర్మన్ బసవయ్యకు వెండి గొడుగు అందజేస్తున్న రమాదేవి, మహిపాల్ గౌడ్

బీబీనగర్, ఫిబ్రవరి 26 : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో గల లింగబసవేశ్వర స్వామికి గ్రామానికి చెందిన కొమ్మగోని రమాదేవి, మహిపాల్ గౌడ్ దంపతులు రూ.6 లక్షల విలువైన వెండి గొడుగును బహూకరించారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ సందిగారి బసవయ్య, ఎండోమెంట్ అధికారి నరేందర్‌రెడ్డికి సోమవారం గొడుగును అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు ఆలేటి బలరాం, ఆల్వ గోపాల్‌రెడ్డి, వంటల శ్రీశైలం, నడికుడి వెంకటేశ్, బుర్రి శివలింగం, గొరికంటి సుజాత, ఎక్స్ అఫీషియో సభ్యుడు రామ్‌సింగ్, ఆలయ పూజారి పుణ్యాసింగ్, నాయకులు రామ కొండల్, రామకృష్ణారెడ్డి, అంజయ్య, ప్రదీప్ గౌడ్, చందు, మల్లేశ్, రాజు పాల్గొన్నారు.

## ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలి

వినతిపత్రం స్వీకరిస్తున్న అధికారులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : ప్రజావాణి సమస్యలను త్వరగా పరిష్కరించాలని జిల్లా స్థాయి అధికారులు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 46 ఫిర్యాదులు అందాయని, అందులో రెవెన్యూ శాఖకు 35, విద్యాశాఖకు 2, ఎంపీడీఓలకు 2, మున్సిపాలిటీకి 3, గిరిజన శాఖకు 2, వైద్య శాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖలకు ఒక్కొక్కటి చొప్పున వచ్చాయని తెలిపారు. మట్టి మాఫియాను అరికట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిట్టల అశోక్ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, డీఆర్‌డీఓ కృష్ణన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, సూపరింటెండెంట్ రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 'సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి'

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి

రాజాపేట, ఫిబ్రవరి 26 : సర్పంచుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని తాజా మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్పంచులు సొంత నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సర్పంచుల పెండింగ్ బిల్లులపై చర్చించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ సర్పంచులు నాగిర్తి గోపిరెడ్డి, కిషన్, రాములునాయక్, నర్సింహారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్‌కు సన్మానం

సీఐ చంద్రశేఖర్‌కు సన్మానం చేస్తున్న గీత కార్మిక సంఘం నాయకులు

మోత్కూరు, ఫిబ్రవరి 26 : ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతగా పని చేసిన ఉద్యోగులకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొలగాని జయరాములు అన్నారు. మోత్కూరు ఎక్సైజ్ సీఐగా ఆరేండ్లు పనిచేసి బదిలీ అయిన చంద్రశేఖర్‌కు సోమవారం సర్కిల్ పరిధిలోని కల్లు గీత సొసైటీల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు సీఐగా బాధ్యతలు చేపట్టిన రవిచంద్రారెడ్డిని సన్మానించారు. సీఐ చంద్రశేఖర్ మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు, వలిగొండ మండలాల్లో గీత కార్మికులకు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సొసైటీల అధ్యక్షులు బుర్ర యాదయ్య, గుండగోని రామచంద్రు గౌడ్, పల్సం స్వామి, పంజాల నర్సయ్య, నాతి రాజు, బాలరాజు, మద్దెల బాలనర్సయ్య, నర్సింహ పాల్గొన్నారు.

## గుడిలో చోరీ

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : మండలంలోని నమాత్‌పల్లి గ్రామంలో పూర్ణగిరి లక్ష్మీనరసింహస్వామి గుడిలో సోమవారం చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దొంగలు కిటికీ తీసి ఆలయంలోకి ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి సుమారు 2 నెలల హుండీలోని డబ్బులను దొంగిలించారు. గుడి చైర్మన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు భువనగిరి రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

# సాధనతోనే లక్ష్యం చేరుకుంటారు

● డీఈఓ నారాయణరెడ్డి

వ్యక్తిత్వ వికాసం ప్రేరణ తరగతుల శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ నారాయణరెడ్డి

చౌటుప్పల్, ఫిబ్రవరి 26 : విద్యార్థులు లక్ష్యం చేరుకోవాలంటే సాధన అవసరమని డీఈఓ కె.నారాయణరెడ్డి అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, రామన్నపేట, భూదాన్ పోచంపల్లి మండలాల ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్మీడియట్ వసతి గృహాల విద్యార్థులకు పట్టణంలో సోమవారం వ్యక్తిత్వ వికాసం ప్రేరణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువులు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన నిర్ణయాలు, జాగ్రత్తలపై అవగాహన కలిగిచేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రేరణ తరగతులు నిర్వహించామన్నారు. విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే సరైన ఆలోచనతో సాధన చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది గొప్పవారి జీవితాలను గమనిస్తే వారి కఠోర సాధన తెలుస్తుందని తెలిపారు. అవసరం మేరకే సామాజిక మాధ్యమాల వాడకం ఉండాలన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ డాక్టర్ పి.లక్ష్మణ్, ఇంటర్మీడియట్ జిల్లా అధికారి రమణి, వెనుకబడిన తరగతుల జిల్లా అధికారి యాదయ్య, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జయపాల్‌రెడ్డి, ఆయా మండలాల ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వార్డెన్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాయతీల పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వినతి

ఎంపీడీఓ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందసేస్తున్న మాజీ సర్పంచులు

మోత్కూరు, ఫిబ్రవరి 26 : గ్రామ పంచాయతీల బకాయి బిల్లులు చెల్లించాలని కోరుతూ మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మనోహర్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు రాంపాక నాగయ్య, పేలపుడి మధు, మల్లేశ్ మాట్లాడుతూ తమ ఐదేండ్ల పదవీ కాలంలో గ్రామాల్లో సీసీ రోడ్లు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డుల నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు. అప్పులు తెచ్చి పనులు చేశామని, పదవీ కాలం గడిచిపోయినా బిల్లులు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ సమస్యలను గుర్తించి బకాయి బిల్లులు ఇప్పించాలని కోరారు.

## రైతుల ఉసురు తీస్తున్న కేంద్రం

● రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌రెడ్డి

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతుసంఘం నాయకులు

రామన్నపేట, ఫిబ్రవరి 26 : రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్యమిస్తున్న అన్నదాతలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాల్పులు జరిపి ఉసురు తీస్తున్నదని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు.

ఢిల్లీలో రైతులపై కాల్పులకు నిరసనగా సోమవారం మండల కేంద్రంలో రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోరాటం చేస్తున్న రైతుల డిమాండ్లపై చర్చించకుండా వారి ప్రాణాలు తీయడం సరికాదన్నారు. మృతిచెందిన యువ రైతు కుటుంబానికి రూ.50లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక చట్టాలను పూర్తి స్థాయిలో రద్దు చేయకపోతే రైతు ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాటంగా మారుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జెల్లెల పెంటయ్య, సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు బోయిని ఆనంద్, గాదె నరేందర్, మీర్ ఖాజా, కందుల హనుమంతు పాల్గొన్నారు.

## మద్దెలమ్మ దేవాలయ కొత్త కమిటీ



మద్దెలమ్మదేవి దేవస్థాన నూతన కమిటీ సభ్యులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 26 : పట్టణంలోని మద్దెలమ్మదేవి ఆలయ నూతన కమిటీని నాయకులు తడక వెంకటేశం ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సూరపల్లి రాము, ఉపాధ్యక్షుడిగా చింతకింది దామోదర్, ప్రధాన కార్యదర్శిగా కడవేరు రాము, సహాయ కార్యదర్శిగా సీత రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా తడక వెంకటేశం, ధర్మకర్తలుగా తడక అనిల్, మంత్రి రాములు, వనం చంద్రశేఖర్, నామాల హరి, గర్దాసు నరేశ్, ఏలె కిరణ్‌కుమార్, సీత భాస్కర్, వేముల శ్రీను, కస్తూరి సుజాత, వేముల భ్రమరాంబ, అయిటిపాముల లక్ష్మి ఎన్నికయ్యారు.

అనంతరం నూతన కమిటీని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భోగ భానుమతి, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, ఉపాధ్యక్షుడు అంకం మురళి, మాజీ ఎంపీపీ బడుగు దానయ్య, అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ సూరపల్లి రమేశ్, నాయకులు లవకుమార్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

## చిన్న మేడారం హుండీకి రూ.10.30 లక్షలు

చిన్నమేడారంలో హుండీ లెక్కిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాజాపేట, ఫిబ్రవరి 26 : మండలంలోని చిన్న మేడారం సమ్మక్క జాతర సందర్భంగా భక్తుల నుంచి వచ్చిన హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. రూ.10.30 లక్షలు వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. రూ.6.30 లక్షల నగదు, 10 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి వచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా వేలం ద్వారా బెల్లం విక్రయానికి రూ.1.15 లక్షలు, బెల్లం, కొబ్బరి కాయలకు రూ.1.40 లక్షలు, పేలాలు రూ.20వేలు, లడ్డూ రూ.12వేలు, తలనీలాలకు రూ.60 వేలు, కొబ్బరి చిప్పలకు రూ.20వేలు, మాంసం విక్రయానికి రూ.60వేల ఆదాయం వచ్చిందని చెప్పారు.

## తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి : జడ్పీటీసీ

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 26 : వేసవిలో తాగునీటి సమస్య రాకుండా గ్రామాల్లోని ప్రత్యేకాధికారులు, గ్రామ కార్యదర్శులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నదని, ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నదని తెలిపారు. అంతకుముందు వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ ఉప్పు భద్రయ్య, తాసీల్దార్ హరికృష్ణ, ఎంపీడీఓ సందీప్‌కుమార్, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### తప్పుడు హద్దులతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు

రాజాపేట, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 177లో గల 20 గుంటల భూమిని తప్పుడు హద్దులు చూపించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు సందిల రమేశ్ సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సదరు రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు.

### లారీ ఢీకొని వ్యక్తి మృతి

వలిగొండ, ఫిబ్రవరి 26 : మండల కేంద్రంలో సోమవారం లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెల్వర్తి గ్రామానికి చెందిన మంత్రి స్వామి (60) తన టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై సోమవారం మండల కేంద్రంలో వెళ్తుండగా అతి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన స్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.



వేంకటేశ్వరస్వామి చక్రతీర్థంలో పాల్గొన్న భక్తులు

## వేంకటేశ్వరస్వామికి చక్రతీర్థ స్నానం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : పట్టణ పరిధి స్టేషన్ రాయగిరిలోని పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ సమీపంలోని కోనేరులో ఉత్సవ విగ్రహాలకు చక్రతీర్థ స్నానం చేపట్టారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కార్యక్రమంలో ఆలయ అర్చకులు సౌమిత్రి వెంకటాచార్యులు, సౌమిత్రి రామాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

## వైభవంగా మహమ్మాయిదేవి రథోత్సవం

మహమ్మాయిదేవి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 26 : పట్టణంలోని మహమ్మాయిదేవి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రథోత్సవం వైభవోపేతంగా జరిగింది. పూలతో అలంకరించిన రథంపై మహమ్మాయి దేవి, పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో దిష్టికుంభం, రథం ఊరేగింపు, చక్రవర్తి సేవ, నవగ్రహాలు, బ్రహ్మాంగారు, నాగేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మహా అన్నదానం, మహా నైవేద్య నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చేపూరి రామ్మోహనాచారి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## చిందు కళాకారుడు స్వామికి కె.విశ్వనాథ్ అవార్డు

కె.విశ్వనాథ్ అవార్డును అందుకుంటున్న స్వామి

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 26 : మండలంలోని తుక్కాపురం గ్రామానికి చెందిన చిందు కళాకారుడు గడ్డం స్వామి కె.విశ్వనాథ్ అవార్డుకు ఎంపికయ్యారు. కళా తపస్వీ కె.విశ్వనాథ్ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డు అందజేశారు. చిందు కళాకారుడైన స్వామికి అవార్డు దక్కడంపై మండలంలోని తోటి కళాకారులు అభినందనలు తెలిపారు.

## ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎంపీపీ శ్రీశైలం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వికారాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లిన యాదగిరిగుట్ట ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డికి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చీర శ్రీశైలం ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. మండలానికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనకు వేంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, ఎంపీఓ చంద్రశేఖర్, ఏపీఓ నారాయణ, ఎంపీటీసీలు కొక్కలకొండ అరుణ, రేపాక మౌనిక, కాల్నె అయిలయ్య, మాజీ సర్పంచులు బీరయ్య, రాములు, శ్రీశైలం, బుజ్జి, చిన్నపుల్లయ్య, భాస్కర్, అనూరాధ, కవిత, గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి శ్రీరాములు

కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 26 : వ్యవసాయ శాస్త్రవేత్త, భారతరత్న స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. రైతు వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ సిఫారసులు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏండ్ల తరబడి రైతులు పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతులకు అనుకూలమైన చట్టాలు తీసుకురాకుండా ప్రధాని నరేంద్ర మోదీ రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రైతులకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చకుండా ఆందోళన చేస్తున్న అన్నదాతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే రైతులకు అనుకూలమైన చట్టాలు తీసుకు రావాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రధానమైన గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్, బునాదిగాని కాల్వతోపాటు నక్కలగండి ప్రాజెక్టులకు సరిపడా నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ కార్యాలయ అధికారులకు అందజేశారు. కొల్లూరు రాజయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్, నాయకులు జంగమ్మ, కృష్ణ గాలయ్య, వెంకటేశ్, సుదర్శన్, ఇమ్రాన్, ముత్యాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 28న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 26 : వరంగల్లులో ఈ నెల 28న జరుగనున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్లను మండల కేంద్రంలో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లంకి మహేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. కేంద్రం అనుసరిస్తున్న వినాశకర ఆర్థిక విధానాల ఫలితంగా చదువుకు తగ్గ ఉద్యోగాలు రావడం లేదని విమర్శించారు. మతోన్మాద రాజకీయాలు, కార్పొరేట్ కబంధ హస్తాల్లో దేశం చిక్కుకున్నదని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఉప్పల ముత్యాలు, మండల సహాయ కార్యదర్శి మారుపాక వెంకటేశ్, ఏఐవైఎఫ్ నాయకులు వీరస్వామి, మత్స్యగిరి, అంజయ్య, మల్లేశ్, నర్సింహ, వెంకటయ్య పాల్గొన్నారు.

## మార్చి 3న ఎమ్మార్పీఎస్ పార్లమెంటరీ స్థాయి సమావేశం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 26 : భువనగిరిలో మార్చి 3న ఎమ్మార్పీఎస్ పార్లమెంటరీ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ మాదిగ తెలిపారు. పట్టణ కేంద్రంలో సోమవారం జరిగిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధత కోసం ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి మంద కృష్ణ మాదిగ హాజరవుతారని, మండలం నుంచి మాదిగలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్ బసవయ్య, నాయకులు శ్రీనివాస్‌మాదిగ, గణేశ్, మహేశ్, గంగయ్య, బాబూరావు, సురేశ్ పాల్గొన్నారు.

## ఐఎన్‌టీయూసీ 327లో పలువురి చేరిక

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 26 : వివిధ సంఘాలకు చెందిన విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్లు, మీటర్ రీడర్లు ఐఎన్‌టీయూసీ 327 యూనియన్‌లో చేరారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన యూనియన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ సమక్షంలో ఎస్పీడీసీఎల్ సొసైటీలో పనిచేస్తున్న 190 మంది ఆపరేటర్లు చేరారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ 327 యూనియన్ కార్మికుల పక్షపాతిగా ఉంటూ వారి సంక్షేమానికి పని చేస్తున్నదన్నారు. జిల్లా, రీజినల్ అధ్యక్షులు మోతుకూరి ఐలయ్య, కుసంగి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మీటర్స్ రీడర్స్ సంఘం జిల్లా నాయకులు మడిపల్లి రమేశ్, సురపంగ పాండు, పక్కి శ్రీనివాస్, కిరణ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు సతీశ్‌రెడ్డి, గ్యార నర్సింగ్ రావు, డివిజన్ ట్రెజరర్ రామచంద్రారెడ్డి, సబ్ డివిజన్ నాయకులు బలరాజు, ఎన్పీడీసీఎల్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేశ్ పాల్గొన్నారు.

## ప్రతిభను వెలికితీసేందుకే టాలెంట్ టెస్ట్ : ఎస్ఎఫ్ఐ

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 26 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్ట్ ఉపయోగపడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుర్ర అనిల్, వనం రాజు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు సోమవారం జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వెంకటేశ్, రా